క్లుప్తంగా

'కుట్ర' నటీనటుల సందడి



నటీనటులకు స్వాగతం పలుకుతున్న వివిధ సంఘాల ప్రతినిధులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలకు చెందిన అడ్వకేట్ సిరిపురం రాజేశ్ డిటెక్టివ్ పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన కుట్ర సినిమా శుక్రవారం విడుదలైంది. స్థానిక జె మినీ థియేటర్‌లో నటీనటులు సందడి చేశారు. నటీనటులు ప్రీతి, గీతిక, ప్రియ, ఘర్షణ శ్రీసుతో పలువురు హాజరయ్యారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ముఖేశ్‌గౌడ్, ఆర్యవైశ్య సంఘం నాయకులు ముక్తా శ్రీనివాస్, మా దంశెట్టి సత్యనారాయణ, మంచాల రఘువీర్, కొండ చంద్రశేఖర్ ఈ సినిమాను వీక్షించారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా వద్ద జ్యోతిబాపూలే పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లాకేంద్రంలో బీసీ జాగృతి నాయకులు శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్టాల మల్లేశ్, ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి సూరన్న, నాయకులు వియ్యాల సత్తయ్య, వెన్నంపల్లి రవి, గుమ్ముల శ్రీను, అందే తిరుపతి, సుధాకర్ రమేశ్, సుదర్శన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ కవితతో జిల్లా యూత్ అధ్యక్షుడు రాజశేఖర్

జైపూర్: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శుక్రవారం హైదరాబాద్‌లో జిల్లా జాగృతి నాయకులు కలిశారు. జాగృతి జిల్లా యూత్ అధ్యక్షుడు మేడి రాజశేఖర్‌తోపాటు నాయకులు కలిసి పలు అంశాలను వివరించారు. జిల్లాలో సమస్యలు, జాగృతి విస్తరణకు చేపడుతున్న చర్యలు, చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఆమెకు వివరించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న పంచాయతీ సభ్యులు

జన్నారం: పది ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామం పేరును జిల్లా స్థాయిలో నిలిపిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను కలమడుగు పంచాయతీ సభ్యులు సన్మానించారు. శుక్రవారం కలమడుగు రైతు వేదికలో సర్పంచ్ కార్తీక్‌రావు, ఉప సర్పంచ్ రాజగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్‌లు వారిని పూలమాలలతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి వినోద్, హెచ్‌ఎం ప్రభాకర్, ఎన్‌సీసీ అధికారి కట్ట రాజమౌళి, వార్డు సభ్యులు దయాకర్, విష్ణు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



మాట్లాడుతున్న రవికుమార్

భీమారం: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని రిటైర్డ్ ఏసీపీ రవికుమార్ అన్నారు. ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం పురస్కరించుకుని భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. హ్యాండ్ బాల్‌పోటీల్లో భీమారం విద్యార్థులు ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. త్వరలో జరిగే ప్రీమియమ్ లీగ్‌కు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రవికుమార్‌ను సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్, పీఈటీ విఠల్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి తగ్గిన ఆదరణ

- బెల్లంపల్లి గ్రంథాలయ పరిస్థితి
- నూతన హంగులతో నిర్మించిన భవనం
- ఏసీ, ఇతర సౌకర్యాలు
- పుస్తక పఠనాలకు పాఠకుల నిరాసక్తత



గ్రంథాలయంలో చదువుకుంటున్న పాఠకులు

బెల్లంపల్లి: 'అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని' అన్నచందంగా తయారైంది బెల్లంపల్లి ప్రభుత్వ శాఖ గ్రంథాలయం పరిస్థితి. ఆధునిక హంగులతో కొత్తగా భవనం నిర్మించినా పాఠకుల ఆదరణ చూరగొనడం లేదు. ప్రస్తుత సెల్‌ఫోన్ యుగంలో విద్యార్థి, యువజనులు పుస్తకాలు, దినపత్రికల పఠనం కోసం గ్రంథాలయానికి వెళ్లేందుకు నిరాసక్తత చూపుతున్నారు. ఈ కారణంగా గ్రంథాలయానికి ఆదరణ తగ్గుముఖం పడుతుండగా రోజువారీగా వచ్చే పాఠకుల సంఖ్య క్రమంగా దిగజారుతోంది.

రూ.75 లక్షల వ్యయంతో..

పారిశ్రామిక ప్రాంతం బెల్లంపల్లిలో 1970లో ప్రభుత్వపరంగా శాఖ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సింగరేణి భవనంలో ఇన్నాళ్లుగా నిర్వహించారు. కొత్త భవనం నిర్మించాలనే డిమాండ్ రావడంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ చొరవతో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.75 లక్షలు మంజూరు చేయించి భవనం నిర్మించారు. మరో రూ.20 లక్షలతో ఫర్నిచర్ కొనుగోలు చేశారు. ఏసీ సౌకర్యం కోసం రూ.4 లక్షలు వ్యయం చేశారు. గతేడాది మే 2న గ్రంథాలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా రీడింగ్స్ రూములు ఉన్నాయి. మరో రెండు క్లాస్‌రూంలు ఉండగా, పుస్తకాలు భద్రపర్చడానికి మరో గది ఉంది. మరుగుదొడ్లు, మూత్రశాలలను నిర్మాణం చేసి మినరల్ వాటర్ సదుపాయం కల్పించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యావంతుల కోసం రూ.2 లక్షలు వ్యయం చేసి కొత్తగా పుస్తకాలు కొనుగోలు చేశారు.

తగ్గుతున్న పాఠకుల రాక

గ్రంథాలయంలో 1,598 మంది సభ్యత్వం కలిగి ఉండగా ఏడాది వరకు రోజువారీగా 150 పైబడి మంది పాఠకులు వచ్చి పుస్తక పఠనం చేసి వెళ్లేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య గణనీయంగా పడిపోయింది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న 60 మందితోపాటు మరో 20 మంది రెగ్యులర్ రీడర్స్ వస్తున్నారు. అయితే పోటీ పరీక్షలు అయిపోయాక పాఠకులు ఎందరు వస్తారనేది అనుమానంగా ఉంది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉన్నా సద్వినియోగం చేసుకోవడంలో విద్యార్థి, యువజనులు నిర్లక్ష్యం చేస్తున్నారు.

అందుబాటులో అన్ని పుస్తకాలు

పాఠకుల కోసం గ్రంథాలయంలో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం 16,756 పుస్తకాలున్నాయి. తెలుగు భాష సంబంధించినవి 12,862, హిందీ 892, ఇంగ్లిష్ 2,872, 124 వరకు ఉర్దూ భాష పుస్తకాలున్నాయి. సాహిత్య, సాంస్కృతిక రంగాల పుస్తకాలు, నవలలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, సైన్స్, జనరల్ స్టడీస్, మహానుభావుల జీవిత చరిత్రల పుస్తకాలు, చరిత్ర గ్రంథాలు ఉన్నాయి.

విస్మరించడం సరికాదు



జిల్లా కేంద్రంతో సమానంగా బెల్లంపల్లిలో గ్రంథాలయ భవనం నిర్మించి సౌకర్యాలు కల్పించాం. పాఠకుల అభిరుచికి అనుగుణంగా పుస్తకాలు తెప్పించాం. ఇంత చేసిన గ్రంథాలయాన్ని వినియోగించుకోలేక పోతుండటం బాధ కలిగిస్తోంది. సెల్‌ఫోన్ ఇతర వ్యాపకాల్లో పడి విజ్ఞానం పంచే గ్రంథాలయాన్ని విస్మరించడం సరికాదు. – రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్,

నందులపల్లిలో ఇంటింటికీ బీజేపీ

నెన్నెల: మంచినీళ్ల లేక మండల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వెంటనే వారికి నీళ్లు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ బెల్లంపల్లి నియోజకవర్గ బాధ్యుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నందులపల్లిలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి సమస్యలను తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శైలేందర్‌సింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి, కార్యదర్శి గోవర్ధన్, శ్రావణ్‌కుమార్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని 11 వార్డు 45వ బూత్‌లో శుక్రవారం బీజేపీ శ్రేణులు మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ 9 ఏళ్ల పాలనలో పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. గడపగడపకూ కరపత్రాలు పంపిణీ చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేశ్, పట్టణ అధ్యక్షుడు కోడి రమేశ్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు నాగరాజు, సతీశ్, యుగేంధర్, రాజశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మెంటరింగ్ వర్క్‌షాప్‌నకు విద్యార్థి

మంచిర్యాలఅర్బన్: నిర్మల్‌లో గత జనవరిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికైన 26 మందికి రెండు రోజులు శిక్షణ ఇచ్చారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నీట్) వరంగల్‌లో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన మెంటరింగ్ వర్క్‌షాప్‌కు అన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి మణిప్రసాద్, గైడ్ టీచర్ సురేందర్ హాజరయ్యారు. ప్రొఫెసర్లు రామచంద్రయ్య, దినకర్, సంపత్‌కుమార్, శ్యామ్, బిద్యాధర్ సుబిద్ధి, లక్ష్మారెడ్డిలు మణిప్రసాద్ చేసిన గ్రెస్ ప్రొటెక్టర్ ఫ్రమ్ రెయిన్ అండ్ అనిమల్స్ అనే ఆవిష్కరణకు మరింత మెరుగుపర్చుకోవడానికి సలహాలు ఇచ్చారు. మణిప్రసాద్‌ను డీఈవో యాదయ్య, సైన్స్ అధికారి మధుబాబు అభినందించారు.

ఘనంగా బలిదాన్ దివస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని నర్సింగాపూర్‌లో బలిదాన్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, ప్రధాన కార్యదర్శి మడిపెల్లి సత్యం, మండల నాయకులు చౌదరి రాకేశ్, కోటె ప్రశాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వలసవాదులకు టికెట్ ఇవ్వొద్దు'

నెన్నెల: రాబోయే శాసనసభ ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి వలస వాదులకు టికెట్ ఇవ్వవద్దని స్థానిక నాయకులకే టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు తీర్మానించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్యనాయకుల సమావేశంలో కార్యకర్తలు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు మల్లేశ్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు స్వామి, గోవింద్‌సింగ్, గట్టు బానేష్ పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన నిర్మూలించాలి

- అదనపు కలెక్టర్ రాహుల్

కోటపల్లి: గ్రామాల్లో బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. పారిశుధ్యం, బహిరంగ మలవిసర్జన నిర్మూలన శిక్షణలో కోటపల్లి, వేమనపల్లి మండలాల ఈజీఎస్, కార్యదర్శులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రతిఇంటా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకుని వినియోగించేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రోగాలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో భాస్కర్ ఉన్నారు.

కిష్టంపేట పంచాయతీ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న రాహుల్

చెన్నూర్‌రూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కిష్టంపేట పంచాయతీ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. సర్పంచ్ రాకేశ్‌గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్‌అలీ, కార్యదర్శి దివాకర్ ఉన్నారు.

కార్మిక సంఘ భవనానికి భూమి విరాళం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని భవన నిర్మాణ రంగాల సంఘానికి జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు దంపతులు భూమి విరాళంగా ఇచ్చారు. తాపీమేస్త్రీ, సెంట్రింగ్, ప్లంబర్, పెయింటింగ్, కార్పెంటర్, ఎలక్ట్రికల్, మార్బుల్, తదితర కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు సంఘ భవనం కోసం రూ.5 లక్షల విలువైన రెండు గుంటల స్థలాన్ని విరాళంగా అందజేశారు. సంఘం సభ్యులకు శుక్రవారం భూమి పత్రాలను శ్రీనివాసరావు అందించారు. కాగా ఇటీవల శిల్ప, శ్రీనివాసరావు దంపతులు సబ్బెపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు గుంట స్థలాన్ని విరాళంగా అందజేయగా కలెక్టర్ సంతోశ్, అదనపు కలెక్టర్ రాహుల్, శిక్షణ కలెక్టర్ గౌతమి, ఎమ్మెల్యే దివాకర్‌రావులతో సన్మానం అందుకున్నారు.



రెండు గుంటల భూమి పత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు

గడప గడపకూ కాంగ్రెస్ పాదయాత్ర

చెన్నూర్‌రూరల్: మండలంలోని లింగంపల్లి, కాంబోజీపేట, లంబడిపల్లి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ కాంగ్రెస్ పాదయాత్ర చేపట్టారు. పార్టీ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేశ్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టి ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ రూ.500లకే అందిస్తామని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్మ రాజమల్లాగౌడ్, నాయకులు జాడి రాజేందర్, జనగామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హోంగార్డు నుంచి కాపాడాలని వేడుకోలు

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని బూడిదగడ్డ బస్తీలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న గోడను పగులగొట్టి ఓ హోంగార్డు భూ ఆక్రమణ చేసిన ఘటన వెలుగుచూసింది. బస్తీలో నివాసం ఉంటున్న తమ ఇంటి స్థలాన్ని, ప్రహరీని హోంగార్డు అక్రమంగా పగులగొట్టి ప్రహరీ నిర్మాణం చేశాడని సుధ ఆరోపించింది. అడ్డుకోబోయిన తమను దుర్భాషలాడి దౌర్జన్యం చేశాడని పేర్కొంది. సదరు హోంగార్డు నుంచి రక్షణ కల్పించి తమ భూమిని ఇప్పించాలని బాధితురాలు సోషల్‌మీడియా వేదిక పోలీసు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. వాట్సాప్ గ్రూపుల్లో సుధ చేసిన పోస్టులు వైరల్ అయ్యాయి.

సంతలో గుడ్డ సంచుల పంపిణీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 6 గని ఉద్యోగులు, అధికారులు ఆర్కే 6 కొత్త రోడ్‌లో వారాంత సంతలో శుక్రవారం గుడ్డ సంచులు పంపిణీ చేశారు. స్వచ్ఛత పక్వాడ, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ తిరుపతి పాల్గొని గుడ్డ సంచులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ కూరగాయలు, సరుకుల కోసం ఇంటి నుంచే గుడ్డ సంచులు తీసుకురావాలన్నారు. సేఫ్టీ అధికారి కె.శ్రీనివాస్, ఫిట్ ఇంజినీర్ శ్యాంకుమార్, ఇంజినీర్ మహేశ్, టీబీజీకేఎస్ నాయకులు ఇప్ప భూమయ్య, వెంగళ కుమారస్వామి పాల్గొన్నారు.



గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల తనిఖీ

నెన్నెల: మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను, గోదాంలను ఏవో ప్రేమ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల డీలర్లు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని సూచించారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి దుకాణదారులు రశీదులు ఇవ్వాలని ఆదేశించారు. కాలం చెల్లిన ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఈవోలు రాంచందర్, సుప్రజ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో ప్రేమ్‌కుమార్

బురదరోడ్డుతో తిప్పలు

భీమారం: మండలంలోని లాల్‌బహదూర్‌పేట నుంచి చెన్నూరు మండలం సుద్దాల వెళ్లే ప్రధాన దారి గురువారం రాత్రి కురిసిన భారీవర్షానికి బురదగా మారింది. దీంతో గ్రామస్తులు తిప్పలు పడ్డారు. లాల్‌బహదూర్‌పేట నుంచి భీమారం వెళ్లేందుకు సరైన మార్గం లేదని, చెన్నూరు మండలంలోని సుద్దాల వరకు లింక్ రోడ్డుని బీటీగా మార్చితే రవాణా సదుపాయం మెరుగుపడుతుందని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలంలో రాకపోకలు కొనసాగించేందుకు మొరం పోయించాలని కోరుతున్నారు.



లాల్‌బహదూర్‌పేటలో బురదమయమైన రోడ్డు

ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై వినతి

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల సమస్యలపై ప్రైవేట్ పాఠశాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ట్రస్మా నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతున్నారని కొన్ని విద్యార్థి సంఘాల నాయకులు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని ఆరోపించారు. తల్లిదండ్రుల సౌకర్యార్థం మాత్రమే పుస్తకాలను ఎమ్మార్పీ ధరలకు విక్రయిస్తున్నామని అన్నారు. ప్రైవేట్‌లో పుస్తకాలు అమ్ముకోవచ్చని ఈవిషయంలో పాఠశాలలను సీజ్ చేయరాదని 2015లో హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మచరణ్, సిద్దయ్య, పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.



డీఈవో యాదయ్యను కలిసిన ట్రస్మా బృందం

బాధ్యులపై చర్య తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: రాజ్యాంగ పీఠికను తప్పుగా ముద్రించడంతో బాధ్యతరహితంగా వ్యవహరించిన ఎస్‌సీఈఆర్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పదో తరగతి సాంఘిక శాస్త్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియం పాఠ్యపుస్తకం కవర్‌పేజీపై ముద్రించిన రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యూలర్ పదాలు తొలగించి ముద్రించడం సరికాదన్నారు. ప్రస్తుతం అమలులోని రాజ్యాంగ పీఠికను వేయడం రాజ్యాంగాన్ని అవమానపర్చడమే అన్నారు.

పుస్తకాలు పంపిణీ

బెల్లంపల్లి: పట్టణంలోని తిలక్‌స్టేడియంలో నిరుపేద విద్యార్థులకు కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, సీనియర్ నాయకుడు గెల్లి జయరాం శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఫుట్‌బాల్, పెన్నులు అందజేశారు. నాయకులు ఎండీ అఫ్జల్, నర్సయ్య, ఆదర్శ్, శ్యామ్, వెంకట్, సమ్మిరెడ్డి, ఉస్మాన్ పాషా పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పరిశుభ్రంగా ఉంచాలి

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పండుగల నేపథ్యంలో ఆలయాలు, మసీదుల వద్ద పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్యకు పలువురు స్థానికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోచమ్మ బోనాల నేపథ్యంలో ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారని, ఆ ప్రాంతంలో ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచి, తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. ఈనెల 29న బక్రీద్ నేపథ్యంలో బస్టాండ్, క్వారీ రోడ్డు ఈద్గాల వద్ద శుభ్రం చేసి, టెంట్లు, మంచినీరు, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ ఎండీ మినాజుద్దిన్, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, గౌసొద్దిన్, తాజొద్దిన్ పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

ఆర్థికసాయం

మందమర్రిరూరల్: మండలంలోని శంకర్‌పల్లికి చెందిన దర్శనాల రమేశ్, కుమారుడు సూర్యతేజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రమేశ్ భార్యకు తీవ్ర గాయాలు కాగా, మంచిర్యాలలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. సామాజికవేత్త దుర్గం అశోక్ శుక్రవారం రమేశ్ కూతురికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. త్వరలో రూ.20 వేల ఫిక్స్‌డ్ బాండ్ అందిస్తానని పై చదువులకు సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

సంక్షిప్త వార్తలు

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన

వేమనపల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కార్యక్రమంలో భాగంగా నీల్వాయిలో సర్పంచ్ గాలి మధు అధ్యక్షతన ఎంపీడీవో లక్ష్మయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ నమూనా పటం ద్వారా మౌలిక వసతులు, ప్రభుత్వ భవనాలు, నివాస ప్రాంతాలు, ఇతర కార్యక్రమాలను వివరించారు. ఇంటింటికీ సర్వే చేపట్టి మరుగుదొడ్ల వినియోగం, ట్విన్‌పిట్, ఇంకుడుగుంతల వివరాలను తెలియజేశారు. ఎంపీవో బాపురావు, స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ రాజేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కోటపల్లి: సర్వాయిపేటలో గత నాలుగేళ్లుగా నివాసం ఉంటున్న ఓ అనాథ మహిళ అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. ఈ విషయాన్ని సర్పంచ్ వసంత కుమారి, కార్యదర్శి రాజశేఖర్‌లు ఎస్సై వెంకట్‌కు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని గ్రామస్తులకు అప్పగించగా స్థానికులు అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా వితంతువుల దినోత్సవం

భీమారం: జ్యోతివికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యాన మండల కేంద్రంలో అంతర్జాతీయ వితంతువుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వితంతువులకు పలు బహుమతులు అందజేశారు. అనంతరం వారు ర్యాలీ నిర్వహించారు. సంస్థ కోఆర్డినేటర్ ఏమ్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంపల్లి: పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ బొంకూరి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా కన్నాల బస్తీ, టేకుల బస్తీ, బజారుఏరియా, గాంధీనగర్, కాల్‌టెక్స్, పెద్దనపల్లి ఏరియాల్లో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రేపు హెచ్‌ఆర్‌సీఐ జనరల్‌బాడీ సమావేశం


మంచిర్యాలఅర్బన్: హైదరాబాద్ షామిర్‌పేట్‌లో ఆదివారం తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఆర్‌సీఐ) జనరల్‌బాడీ సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్ రావు తెలిపారు. జాతీయ చైర్మన్ శ్రీకాంత్, కార్యదర్శి నంద నర్సింహారావు, సౌత్‌జోనల్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ హాజరవుతారని పేర్కొన్నారు.

రేపు మాజీమంత్రి వినోద్ రాక

తాండూర్: మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వినోద్ ఈనెల 25న తాండూర్ మండలంలోని కిష్టంపేట, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటిస్తారని మండల అధ్యక్షుడు ఎండీ ఈసా ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలు తెలుసుకునేందుకు ఈ పర్యటన ఉంటుందని పేర్కొన్నారు.

టెన్త్ టాపర్లకు నగదు పురస్కారం

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి పాఠశాలలో టెన్త్ –2023లో మొదటి మూడు గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులు యామిని, వంశీ, రాము, రోహిత్‌లకు పూర్వ విద్యార్థుల సంఘం (85/2023) నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందించింది. పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్‌రావు, కరస్పాండెంట్ రాజేశ్వర్, హెచ్‌ఎం బి.శ్రీనివాసులు వారికి పురస్కారాలు అందజేశారు. తిరుమల్‌రావు, రాజారెడ్డి, శ్రీవాణి, శ్యాంసుందర్, వెంకటేశ్వర్లు, దొనికెనా సమ్మయ్య, డప్పు సమ్మయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సంపత్ కృష్ణవేణి, ప్రవీణ్ పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు పొందిన టెన్త్‌టాపర్లు